క్లుప్తంగా

ఉచిత వైద్య శిబిరం

పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ మండలం చేపూర్ క్షత్రియ పాఠశాలలో శుక్రవారం పండిత్ దీన్ దయాల్ ఉపాధ్యాయ ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈఎన్‌టీ వైద్య నిపుణుడు చైతన్య, దంత వైద్య నిపుణుడు అనిల్ పడాల్ విద్యార్థులకు పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. కార్యక్రమంలో క్షత్రియ విద్యా సంస్థల చైర్మన్ అల్జాపూర్ శ్రీనివాస్, పాఠశాల ప్రిన్సిపల్ సుజాత పాల్గొన్నారు.

గురడి కాపు సంఘానికి నిధుల మంజూరు

పెర్కిట్(ఆర్మూర్): ఆలూర్ మండలం దేగాం గురడి రెడ్డి కాపు సంఘ భవన నిర్మాణానికి ఎమ్మెల్యే జీవన్ రెడ్డి రూ.10 లక్షల నిధులు మంజూరు చేశారు. గురడి సంఘం సభ్యులు శుక్రవారం హైదరాబాద్‌లో ఎమ్మెల్యే జీవన్ రెడ్డిని కలిసి నిధులు మంజూరు చేయాలని కోరారు. ఎమ్మెల్యే వెంటనే స్పందించి నిధుల మంజూరు పత్రాన్ని గురడి సంఘ సభ్యులకు అందజేశారు. ఎమ్మెల్యేను సన్మానించారు. దేగాం ఉప సర్పంచ్ గడ్డం గంగా రెడ్డి, సొసైటీ మాజీ అధ్యక్షుడు ముత్యం రెడ్డి పాల్గొన్నారు.

కొనసాగుతున్న న్యాయవాదుల దీక్షలు



బోధన్: బోధన్ కేంద్రంగా ప్రత్యేక జిల్లా ప్రకటించాలని డిమాండ్ చేస్తూ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక కోర్టు ఎదుట చేపట్టిన రిలే నిరాహార దీక్షలు శుక్రవారం నాటికి 75వ రోజుకు చేరాయి. దీక్షలో బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఎం.గంగారెడ్డి, న్యాయవాదులు కూర్చున్నారు. పలు ప్రజా సంఘాల నాయకులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

ఎన్నికల అధికారిగా న్యాయవాది గంగాధర్ గౌడ్

బోధన్: బోధన్ బార్ అసోసియేషన్ 2023–24 సంవత్సరానికి గాను నూతన కార్యవర్గం ఎన్నికలు జరుగనున్నాయి. ఈ ఎన్నికల నిర్వహణకు అధికారిగా న్యాయవాది ఎస్.గంగాధర్ గౌడ్‌ను, అసిస్టెంట్ ఎన్నికల అధికారిగా న్యాయవాది బానోత్ రమేశ్‌లను నియమిస్తూ అసోసియేషన్ కార్యవర్గ సమావేశంలో నిర్ణయించినట్లు అసోసియేషన్ ప్రెసిడెంట్ ఎం.గంగారెడ్డి శుక్రవారం తెలిపారు.

అవార్డు గ్రహీతకు సన్మానం

బోధన్: పట్టణ కేంద్రానికి చెందిన మలిదశ తెలంగాణ ఉద్యమకారుడు, బీఆర్ఎస్ మైనార్టీ విభాగం రాష్ట్ర ప్రతినిధి రజాక్‌కు ఇటీవల ఏపీ అధికార భాషా సంఘం, సాహిత్య శిరోమణి సేవా అవార్డును ప్రదానం చేసింది. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని శుక్రవారం బోధన్‌లోని న్యాయవాదుల దీక్షా శిబిరం వద్ద రజాక్‌ను న్యాయవాదులు సన్మానించారు.

నూతన కమిషనర్‌కు..

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ మున్సిపల్ నూతన కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన ప్రసాద్ చౌహాన్‌ను శుక్రవారం టీఎల్ఎఫ్ అధ్యక్షురాలు నీలిమ, ఓబీలు శిరీష, మహేశ్వరి, మెప్మా సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిశారు. కమిషనర్‌ను శాలువా, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. అలాగే జీజీ ఫౌండేష్ సభ్యులు కూడా సత్కరించారు. జీజీ ఫౌండేషన్ అధ్యక్షుడు నివేదస్, సంతోష్, గజానంద్‌లు పాల్గొన్నారు.

వైభవోపేతంగా విఠలేశ్వర ఆలయ ప్రారంభం

రుద్రూర్: మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన విఠలేశ్వర ఆలయ ప్రారంభోత్సవాలు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో వైభవోపేతంగా నిర్వహించారు. మాధవానంద సరస్వతీ స్వామి, మల్లారం పిట్ల కృష్ణ మహారాజ్‌ల ఆధ్వర్యంలో ధ్వజ స్తంభం, శిఖరం, గరుత్మంతుని విగ్రహాలను ప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా హోమం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందచేశారు. పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా భక్తులకు ప్రవచనాలు చేశారు.

మెడికో ప్రీతికి నివాళులు



ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ పట్టణంలోని జమ్మన్ జెట్టి గల్లీలో శుక్రవారం రాత్రి బీజేపీ మహిళా మోర్చా ఆధ్వర్యంలో డాక్టర్ ధారావత్ ప్రీతి ఆత్మకు శాంతి కలగాలని కోరుతూ కొవ్వొత్తులతో నివాళులర్పించారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు మాట్లాడుతూ.. ప్రీతి మృతికి కారణమైన నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి నర్సింహా రెడ్డి, ఆర్మూర్ అసెంబ్లీ నాయకులు వినయ్‌రెడ్డి, విజయ భారతి, జెస్సు అనిల్ పద్మ, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఠాణాకు పోలీసులు కావలెను!

- బోధన్ రూరల్ పోలీస్ స్టేషన్‌ను వేధిస్తున్న సిబ్బంది కొరత
- గ్రామాలు, జనాభాకు తగ్గట్టుగా లేని సిబ్బంది
- నేరాల నియంత్రణ, శాంతిభద్రతల పర్యవేక్షణపై ప్రభావం



బోధన్ రూరల్ పోలీస్ స్టేషన్

బోధన్‌రూరల్(బోధన్): బోధన్ రూరల్ పోలీస్ స్టేషన్‌లో సిబ్బంది కొరత వేధిస్తుంది. జిల్లాలోనే అత్యధిక గ్రామాల పరిధి కలిగి ఉన్న ఈ పోలీస్ స్టేషన్‌లో సరిపడా సిబ్బంది లేకపోవడంతో స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో శాంతిభద్రతల పర్యవేక్షణ, నేరాల నియంత్రణపై ప్రభావం చూపుతోంది. బోధన్ డివిజన్ పరిధిలోని బోధన్, సాలూర మండలాలతో పాటు అంతరాష్ట్ర నేరాల నియంత్రణలో కీలకంగా ఉన్న బోధన్ రూరల్ పోలీస్ స్టేషన్‌లో సిబ్బంది సమస్యపై ఉన్నతాధికారులు దృష్టి సారించకపోవడంతో తీవ్ర ఇబ్బందులు తలెత్తున్నాయి. దీంతో ఉన్న సిబ్బందిపై అదనపు పనిభారం పడుతోంది.

పాత భవనంలోనే విధులు..

బోధన్ రూరల్ పోలీస్ స్టేషన్ ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం 2016లో కసరత్తు మొదలుపెట్టగా 2017 ఏప్రిల్ 4 నుంచి పూర్తిస్థాయిలో అందుబాటులోకి వచ్చింది. ఆ సమయంలో బోధన్ రూరల్ పోలీస్ స్టేషన్‌కు కొత్త భవనం లేకపోవడంతో బోధన్ టౌన్ పోలీస్ స్టేషన్‌లోని కొన్ని గదులను తీసుకుని బోధన్ రూరల్ పోలీస్ స్టేషన్‌ను ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి పాత భవనంలోనే ఈ స్టేషన్ కొనసాగుతుంది. కొన్నేళ్ల క్రితం ఉమ్మడి బోధన్ మండలంలోని సాలూర లేదా సాలూర క్యాంపు గ్రామాల్లో బోధన్ రూరల్ పోలీస్ స్టేషన్‌ను కొత్తగా నిర్మించేందుకు ప్రతిపాదనలు చేసినా కార్యరూపం దాల్చలేదు. ఇక ప్రస్తుతం బోధన్ మండలంలోని పలు గ్రామాలతో సాలూర మండలం కొత్తగా ఏర్పాటు అవ్వగా ఈ రెండు మండలాల్లో కొత్త స్టేషన్ భవనాలు ఏర్పాటు చేయడం అనివార్యమైంది. రాష్ట్ర ప్రభుత్వం, పోలీస్ ఉన్నతాధికారులు స్పందించి బోధన్, సాలూర మండలాల్లో కొత్త పోలీస్ స్టేషన్ భవనాల ఏర్పాటుపై దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. అప్పటి వరకు బోధన్ రూరల్ పోలీస్ స్టేషన్‌లో రెండు మండలాల్లోని గ్రామాలు, జనాభాకు తగట్టు సిబ్బందిని నియమించి శాంతి భద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణకు కృషి చేయాలని రెండు మండలాల ప్రజలు కోరుతున్నారు.

మొత్తం 37 గ్రామాలు

స్టేషన్ పరిధిలో బోధన్, సాలూర మండలాల్లో కలిపి మొత్తం 37 గ్రామాలు ఉన్నాయి. స్టేషన్‌లో ఒక ఎస్సై, ఇద్దరు ఏఎస్సైలు, నలుగురు హెడ్ కానిస్టేబుళ్లు, 21 మంది కానిస్టేబుళ్లు, నలుగు రు హోం గార్డులు ఉండాల్సి ఉండగా ఒక ఎస్సై, ఇద్ద రు ఏఎస్సైలు, ముగ్గురు హెడ్ కానిస్టేబుళ్లు, 13 మంది కానిస్టేబుళ్లు, నలుగురు హోంగార్డులు మా త్రమే ఉన్నారు. వీరిలో ఒక ఏఎస్సై, ఇద్దరు కాన్సిస్టేబుళ్లు డిప్యూటేషన్‌పై వెళ్లగా ఒక హెడ్ కానిస్టేబుల్, 9 కానిస్టేబుళ్ల స్థానాలు ఖాళీగా ఉన్నాయి. ఉన్న 11 మంది కానిస్టేబుళ్లలో రైట ర్, డ్రైవర్, కంప్యూటర్ ఆపరేటర్, కోర్టు పీసీలుగా నలుగురు కానిస్టేబుళ్లు విధులు నిర్వహిస్తుండగా మిగిలిన సిబ్బందితోనే నేరాల నియంత్రణ, శాంతిభద్రత పర్యవేక్షణ పనుల కోసం వినియోగించాల్సి వస్తుంది. ఇక ప్రత్యేక కార్యక్ర మా లు, బందోబస్తు, కోర్టు పనులు వంటి వాటికి సి బ్బందిను పంపించాల్సిన సమయాల్లో స్టేషన్‌లో సిబ్బంది కొరత తీవ్రమవుతుంది.

రాబోయేది కాంగ్రెస్ ప్రభుత్వమే

- రాహుల్ ప్రధాని కావడం ఖాయం
- మాజీ మంత్రి పొద్దుటూరి సుదర్శన్ రెడ్డి



బోధన్‌లో మాట్లాడుతున్న సుదర్శన్ రెడ్డి

బోధన్‌టౌన్(బోధన్): కేంద్రం, రాష్ట్రంలో రానున్నది కాంగ్రెస్ ప్రభుత్వమేనని మాజీ మంత్రి, టీపీసీసీ రాష్ట్ర కోశాధికారి సుదర్శన్ రెడ్డి జోస్యం చెప్పారు. శుక్రవారం కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సమావేశం ఏఆర్ గార్డెన్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వంతో పాటు రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను విస్మరించి, రాజకీయ భవిష్యత్ కోసం పాలన సాగిస్తున్నాయని ఆరోపించారు. ధరలు పెంచి సామాన్య ప్రజలపై పెను భారం మోపుతున్నాయని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం ధరణి పోర్టల్‌ను తీసుకొచ్చి రైతులను ఇబ్బందుల పాలు చేస్తుందన్నారు. బాన్సువాడ నియోజకవర్గానికి వచ్చిన సీఎం కేసీఆర్ నిజాంసాగర్‌కు కాళేశ్వరం ద్వారా నీటితో నింపుతామని చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. రాహుల్ గాంధీ ప్రధాని అవుతారని జోస్యం చెప్పారు. నేటి నుంచి కార్యకర్తలు, నేతలు ఇంటింటికి వెళ్లి ప్రభుత్వాలు చేస్తున్న మోసాలను ప్రజలకు వివరించాలని సూచించారు.

ప్రజాస్వామ్యం ఖూనీ: గాలి అనిల్

రాష్ట్రంలో, కేంద్రంలో ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా ప్రజా స్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారని నిజామాబాద్ పార్లమెంట్ ఇన్‌చార్జి గాలి అనిల్ కుమార్ అన్నారు. రానున్న ఎన్నికల్లో బోధన్ నుంచి సుదర్శన్ రెడ్డిని గెలిపించాలని కోరారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు మానాల మోహన్ రెడ్డి, నాయకులు తాహెర్‌బిన్ హందాన్, పట్టణ అధ్యక్షులు పాషా మోయినొద్దీన్, అబ్బగోని గంగాధర్ గౌడ్, దొడ్ల రవీందర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పంట వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి



మాట్లాడుతున్న అధికారి తిరుమల ప్రసాద్

వేల్పూర్(బాల్కొండ): పంటలు సాగు చేసే రైతుల వివరాలు ఆన్‌లైన్‌లో పూర్తి చేయాలని జిల్లా వ్యవసాయ అధికారి తిరుమల ప్రసాద్ అన్నారు. శనివారం అంక్సాపూర్ రైతు వేదికలో భీమ్‌గల్ వ్యవసాయ డివిజన్ పరిధిలోని ఎంఏవో, ఏఈవోలతో పంటల సాగు వివరాల నమోదుపైన సమీక్ష నిర్వహించారు. జిల్లా వ్యవసాయ అధికారి మాట్లాడుతూ..ఏఈవోలు వారి క్లస్టర్ పరిధిలో పంటల నమోదును రైతులు పంట వేసిన వెంటనే ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి సూచించారు. పీఎం కిసాన్ ఈ-కేవైసీ చేసుకోని రైతుల ఈ-కేవైసీ వెంటనే పూర్తి చేయాలని సూచించారు. ఏడీఏ వాజిద్ హుస్సేన్, భీమ్‌గల్ ఏడీఏ మల్లయ్య, వేల్పూర్, భీమ్‌గల్, కమ్మర్‌పల్లి, మోర్తాడ్, ఏర్గట్ల, ముప్కాల్, మెండోరా మండలాల వ్యవసాయ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

ప్రహరీ నిర్మాణానికి భూమి పూజ



భూమిపూజ చేస్తున్న బీఆర్ఎస్ నేత సురేందర్ రెడ్డి

వర్ని: మండలంలోని అఫందిఫారంలో రూ.10 లక్షలతో నిర్మించనున్న ప్రాథమిక పాఠశాల ప్రహరీ నిర్మాణానికి బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పోచారం సురేందర్ రెడ్డి శుక్రవారం భూమి పూజ చేశారు. సర్పంచులు రఘు, రాజు, వర్ని ప్రా థమిక వ్యవసాయ సహకార సంఘం అధ్యక్షులు సాయిబాబా, నాయకులు వీర్రాజు పాల్గొన్నారు

పెంటాకుర్దులో జీపీ భవనానికి..

బోధన్‌రూరల్(బోధన్): పెంటాకుర్దులో జీపీ భవన నిర్మాణానికి ఎంపీపీ బుద్దె సావిత్రి, సర్పంచ్ శ్రీనివాస్ రావులు శుక్రవారం భూమిపూజ చేశారు. అనంతరం జీపీ భవనానికి స్థలం ఇచ్చిన సర్పంచ్ శ్రీనివాస్ రావును అధికారులు సన్మానించారు.

సీసీ రోడ్డు నిర్మాణ పనులు..

రెంజల్(బోధన్): నీలాలో సీసీ రోడ్డు నిర్మాణ పనులను శుక్రవారం సర్పంచ్ లలితారాఘవేందర్ భూమిపూజ చేసి ప్రారంభించారు. ఎన్ఆర్‌ఈజీఎస్ ద్వారా రోడ్ల నిర్మాణ పనులకు రూ.20 లక్షలు మంజూరయ్యాయని తెలిపారు. వైస్ ఎంపీపీ యోగేశ్, బీఆర్ఎస్ నాయకులు రాంచందర్, శ్రీను ఉన్నారు.

మురికి కాలువ పనులు..

కమ్మర్‌పల్లి: బషీరాబాద్‌లోని ఇందిరమ్మ కాలనీలో రూ.1.80 లక్షల ఎంపీటీసీ నిధులతో చేపట్టే మురికి కాలువ నిర్మాణ పనులను స్థానిక సర్పంచ్ అశోక్, ఎంపీటీసీ తోట జ్యోతి శుక్రవారం ప్రారంభించారు. కార్యదర్శి శ్రీనివాస్, ఉప సర్పంచ్ విక్రమ్ ఉన్నారు.

సంక్షిప్తం

పేదింటి ఆడపడుచులకు కల్యాణలక్ష్మి వరం

ఆర్మూర్‌టౌన్: పేదింటి ఆడపడుచుల పెళ్లికి ప్రభుత్వం కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలు వరంలాంటివని మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్‌మున్ను అన్నారు. పెర్కిట్‌లో శుక్రవారం 8 మంది లబ్ధిదారులకు చెక్కులను ఆయన అందజేశారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

కమ్మర్‌పల్లి: హాసాకొత్తూర్‌కు చెందిన పాలెపు లింగయ్యకు రూ.23 వేలు, మంచాల దివ్యకు రూ.30 వేల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను బీఆర్ఎస్ నాయకులు శుక్రవారం పంపిణీ చేశారు. నాయకులు గడ్డం శ్రీధర్, తెడ్డు కిరీటి పాల్గొన్నారు.

'కంటి వెలుగు'ను వినియోగించుకోండి

రెంజల్(బోధన్): కంటి వెలుగు శిబిరాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని దండిగుట్ట సర్పంచ్ ముళ్లపూడి శ్రీదేవి సూచించారు. శుక్రవారం గ్రామంలో కంటి వెలుగు శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. వైద్యురాలు దివ్య, ఆరోగ్య విస్తరణ అధికారులు శ్రావణ్‌కుమార్ పాల్గొన్నారు.

రాజరాజేశ్వరినగర్‌లో..

కమ్మర్‌పల్లి: మండలంలోని శ్రీరాజరాజేశ్వరీ నగర్‌లో శుక్రవారం కంటి వెలుగు కార్యక్రమాన్ని సర్పంచ్ అమరగోని రోజారాణి ప్రారంభించారు. సదాశివగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఫిజియోథెరపీని సద్వినియోగం చేసుకోండి

ఆర్మూర్: తెలంగాణ సమగ్ర శిక్ష సహిత విద్యా విభాగం ఆధ్వర్యంలో అందించే ఉచిత ఫిజియోథెరపి శిక్షణ సేవల ప్రాధాన్యతను గుర్తించి వైకల్యంతో బాధపడే పిల్లల తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని ఆర్మూర్ మండల విద్యాధికారి రాజగంగారాం సూచించారు. ఆర్మూర్ పట్టణంలోని భవిత ప్రత్యేక అవసరాలు గల పిల్లల వనరుల కేంద్రంలో ఉచిత ఫిజియోథెరపి శిబిరాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించారు. ముఖ్య అతిథిగా ప్రసంగించారు.

జీవాలకు 'నట్టల' మందులు

రుద్రూర్(పోతంగల్): పోతంగల్ మండలం కోడిచర్ల, కల్లూర్ గ్రామాల్లో శుక్రవారం గొర్రెలు, మేకలకు ఉచిత నట్టల నివారణ మందులు పంపిణీ చేశారు. గ్రామాల్లో 5,300 జీవాలకు నట్టల నివారణ మందు వేసినట్టు పశు వైద్యాధికారి సురేశ్ కుమార్ తెలిపారు. కోడిచర్ల సర్పంచ్ పుష్పలత, కల్లూర్ గ్రామ ఉప సర్పంచ్ మోహన్, నాయకులు లింగప్ప, సిబ్బంది సుధీర్ గౌడ్ పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన



ఎడపల్లి(బోధన్): జిల్లా అగ్నిమాపక శాఖ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన సదస్సు నిర్వహించారు. అగ్నిప్రమాదం సంభవిస్తే ఎలాంటి చర్యలు తీసుకోవాలి అనే అంశంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డాక్టర్ దిలీప్‌రెడ్డి, హెచ్‌ఈవో రాములు, స్టేషన్ ఫైర్ ఆఫీసర్ గంగాధర్, డీవోపీ గంగాధర్, ఫైర్‌మెన్ అబ్దుల్ రషీద్, తదితరులున్నారు.

హుండీ ఆదాయం రూ.3.11 లక్షలు

బోధన్‌టౌన్(బోధన్): మహా శివరాత్రి పండుగ సందర్భంగా పట్టణంలోని ఏక చక్రేశ్వర ఆలయంలో ఏర్పాటు చేసిన హుండీ ద్వారా రూ. 3.11 లక్షల ఆదాయం వచ్చిందని దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ సుప్రియ తెలిపారు. శుక్రవారం ఏకచక్రేశ్వర ఆలయంలో హుండీ లెక్కింపు నిర్వహించారు. హుండీ లెక్కింపులో ఆలయ ఈవో రవీందర్ గుప్తా, జూనియర్ అసిస్టెంట్ రాములు, ఆలయ కమిటీ చైర్మన్ బీర్కూర్ శంకర్, పాలక మండలి సభ్యులు ఈరపురం పోశెట్టి, మాశెట్టి నర్సయ్య, లక్ష్మణ్ పటేల్, నారాయణ, శ్యామ్, కో–ఆప్షన్ మెంబర్ రుద్ర సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

కర పత్రాల ఆవిష్కరణ



పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ మండలం అంకాపూర్‌లో శుక్రవారం పిరమిడ్ స్పిరిచువల్ సొసైటీస్ మూవ్‌మెంట్ ఆధ్వర్యంలో మెగా శాఖాహార ర్యాలీకి సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. గ్రామంలో ఈ నెల 5న మెగా శాఖాహార ర్యాలీ నిర్వహిస్తున్నట్లు ధ్యాన ప్రచారకులు కూనిటి శేఖర్ రెడ్డి, విక్రమ్ తెలిపారు. ఈ కార్యక్రమానికి హైదరాబాద్‌కు చెందిన కడ్తాల్ మహేశ్వర పిరమిడ్ ట్రస్టు నిర్వాహకులు నరేంద్ర ముదల్కర్ ముఖ్య అతిథిగా వస్తున్నట్లు తెలిపారు.

పనులు నాణ్యతతో చేయాలి

రుద్రూర్: మోస్రా మండలంలో అభివృద్ధి పనులు వేగిరంగా, నాణ్యతతో పూర్తి చేయాలని మండల స్పెషల్ ఆఫీసర్ సమ్మయ్య ఆదేశించారు. మోస్రా మండలం గోవూర్, మోస్రా గ్రామాల్లో కొనసాగుతున్న మన ఊరు–మన బడి పనులను శుక్రవారం పరిశీలించారు. నర్సరీలో మొక్కలు ఎండిపోకుండా చర్యలు చేపట్టాలని ఉపాధి హామీ సిబ్బందిని ఆదేశించారు. ఆయనతో పాటు హెడ్‌మాస్టర్లు ఉన్నారు.

తాగునీటి సమస్య పరిష్కరించాలని రాస్తారోకో

నందిపేట(ఆర్మూర్): మండల కేంద్రంలోని రాజ్‌నగర్ దుబ్బకాలనీలో నెల కొన్న తాగునీటి సమస్యలను పరిష్కరించాలని మహిళలు శుక్రవారం నిజామాబాద్ ప్రధాన రోడ్డుపై ఖాళీ బిందెలతో నిరసన తెలిపారు. ఇంటి ముందర మిషన్ భగీరథ కుళాయి బిగించారని.. కానీ ఇప్పటి వరకు ఒక్కసారి కూడా నీటి సరఫరా చేయలేదని వాపోయారు. అందుబాటులో ఉన్న బోరుబావి నుంచి కూడా నీరివ్వడం లేదని, ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు. అధికారులు స్పందించి నీటి సమస్యను తీర్చాలని కోరారు.

బాధితుడి ఆత్మహత్యాయత్నం

నవీపేట: జన్నెపల్లికి చెందిన ప్రశాంత్ శుక్రవారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. జన్నెపల్లి గ్రామానికి చెందిన సత్యనారాయణ దగ్గర అదే గ్రామానికి చెందిన ప్రశాంత్ ఇటీవల రూ.30 లక్షల వ్యయంతో ఖాళీ స్థలాన్ని కొనుగోలు చేసి నిర్మాణం చేపట్టాడు. ఆ స్థలం ఇరిగేషన్ పరిధిలోకి వస్తుందని అధికారులు ప్రశాంత్‌కు నోటీసులు జారీ చేశారు. దీంతో ఆందోళనకు గురైన బాధితుడు ప్రశాంత్, సత్యనారాయణ ఇంటి ముందు డీజిల్ డబ్బా పట్టుకుని ఆత్మహత్య చేసుకునేందుకు యత్నించాడు. చుట్టు పక్కల వారు గమనించి అడ్డుకున్నారు.

అటెన్షన్ ప్లీజ్..

ప్రమాదం జరిగితేనే పట్టించుకుంటారా?



కల్యాపూర్ వద్ద రోడ్డు పక్కన ఏర్పడిన గుంత

నవీపేట్–కందకుర్తి ప్రధాన రహదారిలో కల్యాపూర్ వద్ద ప్రమాదకరంగా గుంత ఏర్పడింది. వానాకాలంలో కురిసిన భారీ వర్షాలకు చెరువునీరు ప్రవహించడంతో రోడ్డును ఆనుకుని గుంత తయారైంది. అధికారులు ప్రమాదం జరగక ముందే చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.
– రెంజల్(బోధన్)

ప్రశ్నించాల్సిన అధికారి పేరు: రామ్మోహన్, డీఈ, ఆర్ అండ్ బీ
ఫోన్ నంబర్ : 95737 16963

ప్రత్యేక కార్యాచరణతో 'పది'లో ఫలితాలు



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న డీఈవో

రెంజల్(బోధన్): త్వరలో ప్రారంభమయ్యే పదో తరగతి పరీక్షలను ప్రత్యేక కార్యాచరణతో ఫలితాలను సాధించేందుకు ప్రయత్నించాలని డీఈవో దుర్గాప్రసాద్ సూచించారు. రెంజల్‌లోని కస్తూర్బా విద్యాలయం, ఆదర్శ కళాశాల హాస్టల్‌తో పాటు రెంజల్, సాటాపూర్ గ్రామాల్లోని పాఠశాలల్లో జరుగుతున్న మన ఊరు–మన బడి పనులను, మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ కార్యక్రమాలను నిర్ణీత సమయంలో పూర్తి చేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ప్రజాప్రతినిధులు సహకరించి పనులు తొందరగా పూర్తి చేయించాలని సూచించారు. పదవ తరగతి ప్రి ఫైనల్ పరీక్షల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట మండల ప్రత్యేకాధికారి రాములు, ఎంఈవో గణేశ్‌రావ్, ఎంపీడీవో శంకర్, రెంజల్, సాటాపూర్ సర్పంచ్‌లు మర్ల రమేశ్‌కుమార్, ఎఖార్ పాషలు ఉన్నారు.

పెంచిన ధరలతో పేదలపై పెనుభారం



ఆర్మూర్‌లో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీఆర్ఎస్ నేతలు..



రుద్రూర్‌లో నిరసనలు

కేంద్ర ప్రభుత్వం పెంచిన గ్యాస్ ధరలతో పేదలపై పెనుభారం పడిందని వివిధ రాజకీయ పార్టీల నేతలు అన్నారు. శుక్రవారం ఆర్మూర్, బోధన్, బాల్కొండ నియోజకవర్గాల పరిధిలో పలు చోట్ల కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసనలు, ధర్నాలు, రాస్తారోకోలు నిర్వహించారు. వంట గ్యాస్ ధర తగ్గించకపోతే మహిళల ఆగ్రహాన్ని చవిచూడాల్సి వస్తుందని బీజేపీ నేతలనుద్దేశించి బీఆర్ఎస్, కాంగ్రెస్ నేతలు వ్యాఖ్యానించారు. కేంద్ర ప్ర భుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేసి దిష్టిబొమ్మలను దహనం చేశారు. – సాక్షి నెట్‌వర్క్



బోధన్‌లో ఆందోళన చేస్తున్న కాంగ్రెస్ నేతలు



వర్నిలో నిరసన తెలుపుతున్న బీఆర్ఎస్ నేతలు

తల్లిదండ్రుల ఆశయాలు నెరవేర్చాలి



చైర్ పర్సన్‌ను సన్మానిస్తున్న ప్రిన్సిపల్, అధ్యాపకులు

ఆర్మూర్‌టౌన్: విద్యార్థులు కష్టపడి చదివి తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చాలని ఆర్మూర్ మున్సిపల్ చైర్ పర్సన్ పండిత్ వినీత అన్నారు. ఆర్మూర్ పట్టణంలో శుక్రవారం నిర్వహించిన ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల వార్షికోత్సవానికి చైర్ పర్సన్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యార్థులు ఎప్పటికప్పుడు నైపుణ్యాలను పెంచుకుంటూ ముందుకు సాగాలన్నారు. అలాగే చదువుతో పాటు ఆటల్లో రాణిస్తే భవిష్యత్‌లో క్రీడాకోటాలో ఉద్యోగ అవకాశాలు మెరుగు పడతాయన్నారు. వేడుకల సందర్భంగా నిర్వహించిన క్రీడా పోటీల్లో విజేతలకు చైర్ పర్సన్ బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ ఎల్ఎంబీ రాజేశ్వర్, డీఐఈవో రఘురాజ్, ప్రిన్సిపల్ అస్గరి బేగం పాల్గొన్నారు.

అలీసాగర్‌లో ఆదివారం మట్టి స్నానాలు

ఎడపల్లి(బోధన్): మండలంలోని అలీసాగర్‌లోని బోటింగ్ పాయింట్ వద్ద ఆదివారం బాపునగర్ పతంజలి యోగా కేంద్రం వారి ఆధ్వర్యంలో మట్టి స్నానం కార్యక్రమం ఉంటుందని జిల్లా యోగ అసోసియేషన్ అధ్యక్షులు ఎక్కొండ ప్రభాకర్ శుక్రవారం తెలిపారు. యోగ గురువులు జీలకర కిషన్, యోగ శిక్షకులు ముద్దం ఆంజనేయులు ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. యోగా శిక్షకుడు సూర కిరణ్ మాట్లాడుతూ .. పుట్టమట్టి, ఆవుపేడ, ఆవుమూత్రం, తులసి, ఉత్తరేణి తంగేడు, కలబంధ, తిప్పతీగ, వేపాకు, త్రిఫల చూర్ణం వంటి మూలికలను తెచ్చి నానబెట్టి శరీరానికి పూసుకుని గంట సేపు ఉంచుకొని స్నానం చేసినట్లైతే చర్మ వ్యాధులకు దూరంగా ఉండవచ్చునన్నారు.

మహిళల హక్కుల కోసం పోరాడుదాం



ఆర్మూర్‌టౌన్: మహిళలపై జరుగుతున్న దాడులకు వ్యతిరేకంగా, మహిళల హక్కుల కోసం పోరాడాలని ప్రగతిశీల మహిళా సంఘం జిల్లా అధ్యక్షురాలు గోదావరి పిలుపునిచ్చారు. ఆర్మూర్ పట్టణంలో శుక్రవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం జరుపుకున్నారు. ఆమె మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వ ఫాసిస్టు మనువాద విధానాలకు వ్యతిరేకంగా మార్చి 8న అంతర్జాతీయ మహిళా దినం జరపాలన్నారు. బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్లకు దేశ సంపదను దోచిపెడుతోందని విమర్శించారు.